# గట్టి నిశ్చయం

కాంతం నేనూ కూర్చొని లెక్కలు చూచుకొనేసరికి ఆ నెల అయిన ఖర్చు ఏ నెలా కాలేదని తేలింది. కారణం బంధువుల తాకిడి, కాంతం అన్నదీ “చూడండి మీరు ప్రతివాడ్ని భోజనానికని యింటికి తీసుకొనిరాకండి! కాస్త మంచి మాట మాట్లాడితేసరి ఆయనమీకు పరమమిత్రుడౌతాడు. ఇక వాడికి అల్లుడిలాగ ఇంట్లో భోజనం, బయట కాఫీ హోటలులో టిఫిన్! ఇదీ వరస. మీ కథలు బాగున్నాయని ఎవరైనా అనటం తరువాయి వాడి కాఫీ ఖర్చు అంతా ఆ పూటకు మీదన్నమాటే! ఇలా అయితే సంసారంగడవదు. తరువాయి మీయిష్టం. ఇక ఎవరినీ భోజనానికి పిలువకూడదని గట్టిగా నిశ్చయించుకోండి” అన్నది కాంతం నేను మేడ మెట్లు ఎక్కుతుంటే.

ఇంతలో ఎవరో ఒక బ్రాహ్మణుడు మూట ఒకటి చంకను పెట్టుకొని “ఇదేనా కాంతమ్మగారి ఇల్లు” అని అడిగాడు మాయింటి ముందు నుంచుని. “ఈ యింట్లో వెంకట్రావుగారు అద్దెకున్నారు” అన్నాను నేను.

కాంతమ్మగారెవరు? వారిక్కడ లేరా అన్నాడు” ఆయన ఆతురతతో.

ఆవిడ నవ్వుకొంటూ “రండి ఇదే లెండి. నా పేరే కాంతమ్మ. ఎందుకండీ” అన్నది.

అమ్మాయీ నువ్వేనా? చూడటంతోనే అనుకొన్నా. రత్నం చీకట్లో ఉంచినా మెరుస్తూనే ఉంటుంది.

“తమరు ఎవరు? ఏవూరు?”

“చెబుతాలే అమ్మా. రామారావుగారు చెప్పారు. తమ సంగతి, మీరు సంపన్న గృహస్థులనీ, ఉదారవంతులనీ నడి శ్రావణమాసంలో కొత్తనీటితోనిండి, బెక బెక అరుస్తూ ఉన్న అనేకరకములైనషవంటి మండూకములచే నిండియున్న ఒకమాంచి తటాకంలాగ తమ గృహం ప్రకాశిస్తూ ఉంటూందని విని............”

మా ఆవిడ మొఖం చేటంత అయింది. సంతోషంతో తొణకసలాడుతూన్న ముఖంతో అల్లాగే నుంచుని చూస్తోంది.

"అమ్మాయీ, నేనేమో చెబుతున్నానని పొగుడుతున్నానని అనుకోకు. రామారావుగారి వలన మీ సంగతి అంతా విన్నాను. మీ అనుకూల దాంపత్యం, సిరి, సంపదా, మీదైవభక్తి...అంతా బంగారానికి సువాసన అబ్బినరీతి.......ఆ పరమేశ్వరుని అనుగ్రహం. అమ్మా" అన్నాడు.

"బాబుగారూ, మీరు సరేవచ్చారు? బాగానే వుంది. తమకేం కావాలె! బీదవాళ్ళం మాతో మీబోటి సద్బ్రాహ్మణులకు ఏం పనుందో నేనూహించలేకుండా ఉన్నాను" అన్నది ఈవిడ.

"అమ్మాయి, నీవు అల్లా గౌరవించటం నీయొక్క సుగుణములు ఇటువంటివని చెపుతున్నాయే కాని మరోటి కాదు. నమ్రత అనేది ఉన్నదే అమ్మా, అది ఎటువంటివారికైనా భూషణమే అవుతూ వున్నది. ఒక పుష్పవనములో మాంచి గోముగా పెరిగినదై కమ్మనివాసనతో కూడిన పుష్పములూ తియ్యని ఫలములూ ఉండుటచేత, వంగినటువంటిదై యున్నూ, వంగినా భారముచే కలిగిన విసుగునుగాక, కేవలమూన్నూ, నమ్రతనే సూచిస్తూ, వివిధములైన పక్షిజాతులకు ఆశ్రయమిస్తూ, ఉన్న మామిడిగున్న ఏలాగంటి సౌశీల్యాన్ని వ్యక్తపరుస్తుందో, అల్లాటిది మీసౌశీల్యము" అన్నాడాయన.

ముసిముసి నవ్వులు నవ్వుకొంటూ "బాబూ ఏదో పెద్దల ఆశీర్వాదము. అయితే నేను లోపలికివెళ్ళాలి. తమరు వచ్చినపనేదో సెలవివ్వాలె."

"ఏబ్బే ఏమీ లేదండీ-మిమ్ములను ఏమీ కోరటానికి గాని యాచనకుగాని రాలేదు. రామారావుగారి ద్వారా సంపన్న గృహస్థులు మీరు, ఆమాటవిని మీదర్శనంచేసి వెడదాం అని వచ్చాను. అంతేకాని మరోటి కాదు."

"బాబూగారూ మీరు మధ్యాహ్నం భోజనానంతరం రండి. కాస్త పురాణకాలక్షేపంచేద్దురుగాని, ఇప్పటికి సెలవ."

"ఒక్కమాట అమ్మాయీ విన్నావామంచి సౌందర్యాది విలాసములతో

ఒప్పుతున్నషువంటి వస్తువును చూశామా అంటే పంచభక్ష్య పరమాన్నాలతో భోజనం చేసినట్లే ఉంటున్నది. ఇపుడు రామారావుగారి ఇల్లు చూడండి. భార్య జబ్బు మనిషి. పిల్లలు లేరు. పైగా ఆ గదిలో ముసలిది. ఆయన తల్లికాబోలు. తల్లిని 'మాతృదేవోభవ' అన్నాడు. పూజించవలసిందే కాని పిల్లజెల్ల లేని కొంపలో భోజనం అంటే అదేమిటో నట్టడవిలో కూడుతిన్నట్టుంటుంది. అవునా.... అమ్మాయీ అదీ సంగతి. ఇపుడు మీ గృహము చూడండి. ఎంత ఆహ్లాదకరంగా ఉందో, పేరు పొంది, కీర్తిని విస్తారం గడించినట్టి మాంచి చిత్రకారులచే చిత్రింపబడిన ఉత్తమమైన చిత్రములచే అలంకరింపబడిన దివ్య సౌధములాగ ఉంది కాదు మీ ఇల్లు."

'ఏముందండీ మా ఇంట్లో, ఇంటినిండా గుడ్డపేలికలూ, పేడబొమ్మలూ, దిశమొలతోనున్న ఆపిల్లలూనూ'

'ఆ ఆ దిశిమొలలే సజీవమైన చిత్రాలు. అక్కడే ఉంది, ఆ పిల్లల వలననే ఈ యిల్లు సజీవమైన చిత్రశాల అయింది'.

"ఏదోలెండి పెద్దల ఆశీర్వచనము. అయితే బాబూ తమ దేవూరు?"

'మాది తెనాలివద్ద కుంచవరం'

'తెనాలి తరుచూ వస్తుంటారా?'

"ఆ తరుచూ ఏమిటి. ప్రొద్దునలేస్తే తెనాలిరాకతప్పదు. ఆకుకూ, కూరకూ, మందుకూ, మాకుకూనూ."

'మందెవరికి బాబూ?'

"నాకు కాదమ్మా. మాముసలిది ఈమధ్య మాచెడ్డ జబ్బుపడ్డది. బ్రతుకుతుందను కోలేదు. తెనాలిలో ఒక డాక్టరు గారున్నారమ్మా. చిన్నవాడే కాని ఏమి అనుభవం! ఏమి ఓపికా! ఆయనేదానికి ప్రాణదానం చేశారు. గంపెడు సంసారం నాదీనీ! అది తప్పితే ఇంట్లో గంగపోశే వాళ్లు లేరు! ఆ మహానుభావుని దయవల్ల మళ్ళీ బ్రతికి బట్టగట్టింది, ఆయనకు చెయ్యెత్తి దణ్ణం పెట్టని రోజులేదు! చల్లనివేళ జ్ఞాపకం వచ్చాడమ్మా శ్రీరామమూర్తిగారు!"

"మా తమ్ముడే!....మా తమ్ముడేనండి ఆయన!" అన్నది. మాఆవిడ పొంగిపోతున్న సంతోషాన్ని ఆపుకోలేకుండా.

ఆయన కూడా వెనక్కు విరుచుకొనిబడి నోరు తెరిచి ఒక్క అరనిమిషం అల్లాగడుండి "అల్లాగ అమ్మా" అని అన్నాడు. తెప్పరిల్లి. 'మాతమ్ముడే' అన్నది మళ్ళీ ఈవిడ.

"చిత్తం. ఇహ. ఎందుకూ' తెలిసింది! గులాబీ మొక్క ఎక్కడ వున్నా ఒకే మోస్తరు పూలు పూస్తుంది. ఒకేరకం సువాసన! నాతల్లీ...ఎంత సుదినం ఇవ్వాళ!.........."

'అమ్మాయీ, నీవూఆయనా ఒక్క తల్లిబిడ్డలేకాదూ?'

'ఆ. ఒక్కతల్లి బిడ్డలం' అని అంది కాంతం గర్వంగా.

'ఆహా! ఆ తల్లి సుకృతం. యీలాంటి సంతానాన్ని కనటం. మీ అమ్మ కడుపు చలవదనమమ్మా ఇదంతా. ఆమె నిజంగా మహాపుణ్యాత్మురాలు.'

'కాబట్టే, పాతికేళ్ళకే పరలోకానికి–' అన్నది.

"అల్లాగ అమ్మా పాపం...........ఇప్పుడు ఉండి మీ తమ్ముడిగార్ని సర్వజనులూ మెచ్చుకొంటూ వుండడం, సర్వవృద్ధులూ ఉండటం, ప్రతివాడూ కృతజ్ఞతతో బీదలపాలిట దేవుడని, ఆయనకు నమస్కారం చేస్తూ ఉండటం, ఆవిడ వుండి చూస్తే ఆ మాతృ హృదయం ఎంత సంతోషించేదో! నీ సంసారం–నీ ఆనందం కూడా చూడకుండా పోయింది కాబోలు ఆ తల్లి!" అన్నాడు ఆ బ్రాహ్మణుడు.

'ఆ' అన్నది కాంతం చెమ్మగిల్లిన నేత్రాలతో,

అప్పటికే తొమ్మిదైంది. ఆయన ఆప్తబంధువులాగ, పిల్లల అందరి పేర్లూ అడిగి తెలుసుకొని, అందరినీ దీవించి "ఇక వెడతానమ్మా" అన్నాడు.

'మీరు ఈ పూట ఇక్కడే దేవతార్చన చేయాలండీ' అన్నది కాంతం.

'ఎందుకులే అమ్మా. రామారావుగారు ఏమైనా అనుకొంటారు.'

"ఏమనుకోరు లెండి. మీరు తప్పక ఇక్కడే ఉండి పోవాలె. మనమంతా గుంటూరు జిల్లా వాళ్ళము. అందులో మీరుసత్పురుషులున్నూ, చదువుకొన్నవారున్నూ, పెద్దలూ తప్పక ఇక్కడే దేవుతార్చన తప్పదు."

"అమ్మాయీ" నీవు బంధువులకంటే ఎక్కువగా కుమార్తెవలె ఆదరిస్తున్నావు నీ మనస్సుకు కష్టం కలుగజెయ్యటం ఎందుకూ. సరే–కాలువ ఎటువైపమ్మా? మూట ఇక్కడ పెట్టుకోనా?"

ఈ రోడ్డే వెళ్ళండి, కాలువ కనుపిస్తుంది. సంధ్యావందనం కాలువలో చాలసేపు చేయకండేం. వారు మళ్ళీ కచ్చేరికి వెళ్ళాలె.

'ఎంతోసేపా, రెండు మునకలు వేసి రెండు నిమిట్లోరానూ!'

కాంతం పరుగెత్తుకుంటాపైకొచ్చి, 'చూడండి, సద్బ్రాహ్మణుడు చదువుకొన్నవాడూ, వేదం అవీ చదువుకొన్నాడనుకొంటా, మనవేపువాడే, మనవాడినీ, మా చెల్లెళ్ళనూ అందరినీ ఎరుగునట!'

'అయితే...'

'ఆయన మన ఇంటికి వస్తే, దేవతార్చన ఇక్కడే చేసుకోవాల్సింది, అన్నాను.'

'ఎవరో టోపి వేశాడు!'

'చాల్లే ఊరుకోండి, కళ్ళుపోతాయి. మంచి బ్రాహ్మణ్ణి ఏమైనా అనేరు. పిల్లలగలవాళ్ళం మనం...'

'సరే నే నిప్పుడు చేయాల్సిందేమిటి.'

"కొంచెం బజారుకెళ్ళి... శనివారమేగా-కూరలూ, అవీ, తమలపాకులు, వక్కలు ఇంట్లో ఉన్నాయి లెండి. చూడండి ఒక్క వరక నాజూకు పసందు......ఆ......... విన్నారా?.........కాస్త మంచిరకం తీసుకు రండి.......... చూడండి......మిమ్మల్నే.......... ఒక్కమాట దారిలో సోమాయితో, ఒకశేరు పాలు కావాలని చెప్పండి!"

"కూరలు తేవటానికి డబ్బులేదే!"

"ఎక్కడైనా అప్పుజేసి అయినాసరే.......తప్పదు."

"ఇందాక మనం అనుకొన్న మాట ఏమిటి? నీవు ఇల్లాగా........."

"ఆనెక్కి మాట్లాడుకుందాంలెండి. నాకు వంటింట్లో పనుంది. మీరు వెంటనే బజారు కెళ్ళండి నా మాటవిని. ఏ స్నేహితుడితోనో మాట్లాడుతూ కూర్చోకండి. వేగిరం రావాలె. చూడండీ, పసిదాన్ని చంక వేసుకొని పోరాదూ బజారుకేగా! నేను ఇంట్లో పని వేగిరం చేసుకోవాలె."

ఈ మాటవినేసరికి వళ్ళు మండిపోయింది. ఉత్తరీయం ఝాడించి పైన వేసికొని తిరిగి చూడకుండా గుమ్మందాటాను.